పల్లె పండుగతో గ్రామాల్లో ప్రగతి

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదితి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : గ్రామాల ప్రగతికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ నూతన అధ్యాయాన్ని సృష్టిస్తుందని శాసన సభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. చెల్లూరు, బడుకొండపేట, సుంకరిపేట, మలిచెర్ల, రీమాపేట మరియు ముడిదాం గ్రామాల్లో గురువారం పల్లె పండుగ అభివృద్ధి పనుల్లో భాగంగా సిసి రోడ్లకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ గ్రామాల రూపు రేఖలు మార్చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో జొన్నవలస ఎంపిటిసి రాజేష్ బాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొద్దల నర్సింగరావు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర విజయనగరం

పేజి నెం. 8

శుక్రవారం 18, అక్టోబర్ 2024

నిధుల లభ్యతతో సమస్యల పరిష్కార చర్యలు

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: వార్డు సందర్శన కార్యక్రమం బొబ్బిలి పురపాలక సంఘం పరిధిలోగల కొత్త ఎరుకల వీధి మహారాణిపేట ఏరియాలలో మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఆధ్వర్యంలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది తో నిర్వహించారు. వివిధ శాఖలకు అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రజల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేతాజీ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూలులో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందుతున్నది లేనిది పరిశీలించి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కొత్త ఎరుకుల వీధి కమ్యూనిటీ టాయిలెట్ ప్రక్కన ఉన్న ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని, పబ్లిక్ కూళాయి వేయించాలని మరియు నేతాజీ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ ఎదురుగా చేతిపంపు వేయాలని,ఎరుకుల కాలనీకి ఆనుకుని ఉన్న మెయిన్‌డ్రైన్ కు శాశ్వత పరిష్కారం చూపించాలని, కాలువలలో ఉన్న సిల్టు తొలగించాలని, తాగునీటి పైపులైన్లు ఏర్పాటుచేయాలని,మెయిన్ రోడ్డులో శిధిలావస్థలో ఉన్న కరెంటు పోల్ ను తొలగించాలని కోరుతూ ప్రజలనుండి వచ్చిన ఫిర్యాదులను నిధులు మంజూరును బట్టి అంచనాలు తయారుచేయించి పనులు పూర్తిచేస్తామని మున్సిపల్ కమిషనర్ తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డయేరియా బాధితులకు అత్యుత్తమ వైద్య సాయం

- నీరు కలుషితం కాకుండా చర్యలు
- బాధితులను పరామర్శించిన మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర-నెల్లిమర్ల/గుర్ల: అతిసారం బారినపడిన వారికి అత్యుత్తమ వైద్యసహాయం అందిస్తున్నామని, వారంతా ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గుర్ల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని గురువారం మంత్రి సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ గ్రామంలోనే వైద్యశిబిరం ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందించడంతోపాటు జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో చేర్పించి వారికి అందుతున్న వైద్యసహాయంపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వైద్యాధికారులు, పంచాయతీరాజ్, గ్రామీణనీటిసరఫరా విభాగాల అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. వివిధ ఆసుపత్రుల్లో బాధితులకు అందిస్తున్న వైద్యసహాయంపై మంత్రికి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.ఎస్.భాస్కరరావు వివరించారు. గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలు, పారిశుధ్య నిర్వహణ పనులపై జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు మంత్రికి వివరించారు. గ్రామంలో తాగునీరు కలుషితం కావడానికి గల కారణాలపై మంత్రి అధికారులతో చర్చించారు. పలు బోర్ల నుంచి నమూనాలు సేకరించగా కొన్నింటి నుంచి భూగర్భ జలాలు కలుషితం అయినట్టు రిపోర్టులు వచ్చాయని అధికారులు తెలిపారు. అదే సమయంలో తాగునీటి పథకాల ద్వారా సరఫరా అవుతున్న నీటి నాణ్యతపై కూడా రిపోర్టులు సేకరించాలని మంత్రి ఆదేశించారు. ఈ నివేదికలన్నీ సమగ్రంగా విశ్లేషించిన తర్వాత నీరు కలుషితం కావడానికి కారణాలపై ఒక అంచనాకు రావాలని చెప్పారు. అప్పటివరకు గ్రామస్థులకు ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారానే నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. నీరు కలుషితం కావడానికి కారణాలు తెలిసిన తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తర్వాత మాత్రమే గ్రామంలోని తాగునీటి పథకాలు గాని, బోర్లు గాని వినియోగించేలా గ్రామస్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో 22 మంది, ఘోష ఆసుపత్రిలో 18 మంది, చీపురుపల్లిలో 7 మంది, విజయనగరం సర్వజన ఆసుపత్రిలో 18 మంది చికిత్స పొందుతన్నారని, ముగ్గురిని కె.జి.హెచ్.కు తరలించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.భాస్కరరావు వివరించారు. గత ఐదు రోజులుగా ఇక్కడ పరిస్థితులపై అధికారులతో మాట్లాడి తెలుసుకుంటున్నామని చెప్పారు. గ్రామంలోని పలు రకాల నీటి వనరుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు జరుపుతున్నామని, త్వరలోనే కారణాలపై ఒక నిర్ధారణకు వస్తామన్నారు. గ్రామంలోని వ్యర్థాలను చంపావతి నదిలోకి విడిచిపెట్టడం కూడా నీరు కలుషితం కావడానికి ఒక కారణంగా గుర్తించామన్నారు. భవిష్యత్తులో వ్యర్థాలను నదిలోకి విడిచిపెట్టకుండా చర్యలు చేపడతామన్నారు. పైనున్న గ్రామాలు వ్యర్థాలు నదిలోకి విడిచిపెట్టకుండా ఒక నివేదిక అందించాలని డి.పి.ఓ.ను ఆదేశించామన్నారు. గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారని, ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నారని చెప్పారు. ఈరోజు సాయంత్రం కల్లా తాగునీటి పరీక్షలకు సంబంధించిన నివేదికలు వస్తాయని చెప్పారు. భూగర్భ జలాలు కలుషితం అయినట్లు నిర్ధారణ జరిగితే దానిని నివారించే చర్యలు చేపడతామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ డైరక్టర్ పద్మావతి చీపురుపల్లి ఆర్.డి.ఓ. సత్యవాణి, డి.ఎం.హెచ్.ఓ. డా.భాస్కరరావు, డిపిఓ వెంకటేశ్వరరావు, గ్రామీణ నీటిసరఫరా ఎస్.ఇ. ఉమాశంకర్ మంత్రితో ఉన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం

ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డులు పెట్టిన రెవెన్యూ

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర-జామి: మండలంలోని మొఖాసా కొత్తవలస రెవెన్యూ పరిదిలో సర్వేనెం.85-12లో ఉన్న 1.41 ఎకరాల ప్రభుత్వ భూమిపై విశాలాంధ్రలో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించారు. ఈస్థలం ప్రభుత్వ కొండ పోరంబోకుగా రికార్డులో నమోదై ఉంది. అయితే గతకొంత కాలంగా స్థానికంగా ఉన్న ఓవ్యక్తి ఈస్థలాన్ని ఆక్రమించుకుని ఇతరులకు లీజకు ఇచ్చారు. ఈవిషయాన్ని విశాలాంధ్ర వెలుగులోకి తీసుకువచ్చింది. తహశీల్దార్ ఐ.కృష్ణలత వెంటనే ఈస్థలంను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టారు. విఆర్వో వీరన్న, సచివాలయ సిబ్బందితో కలిసి ప్రభుత్వ భూమిని సందర్శించి అక్కడ పలు చోట్ల హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఈస్థలం ప్రభుత్వానికి చెందినది అని, ఎవరైనా ఆక్రమించినా శిక్షార్హులుగా హెచ్చరిక బోర్డులో రాసారు. అలాగే ఆక్రమించిన వ్యక్తికి నోటీసులు అందించినట్లుగా తెలిసింది. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని కాపాడినందుకు స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మాది చేతల ప్రభుత్వం...

మెరకముడిదాం పల్లె పండగలో ఎమ్మెల్యే కళా వెంకట్రావు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో కమిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన చీపురుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగ కార్యక్రమాన్ని మండలంలో ముందుగా కొబ్బరికాయ కొట్టి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల ద్వారా ముఖ్యమైన సమస్యలను అర్జీల రూపంలో తెలుసుకోవడం జరిగింది. వాటి పరిష్కారం కోసం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెరకముడిదాం ఎంపీడీఓ కార్యాలయం ప్రక్కన 80 లక్షలతో కమిటీ హాల్ నిర్మాణం, అలాగే శివ ఆలయం దగ్గర ఉన్నా చెరువు చుట్టు సీసీ రోడ్డు 400 మీటర్లు నిర్మాణంతో పాటు పార్కింగ్ రూపంలో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.మండలం మొత్తము రెండు విడతల్లో 10 కోట్ల యాభై లక్షల రూపాయలు మంజూరు అయిందని. మొదటి విడతలో మండలం మొత్తం ఐదు కోట్ల 30 లక్షలు రూపాయల విడుదల అయిందని అలాగే 71 రకాల పనులు చేసుకోవడానికి అవకాశం వచ్చిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మాది చేతల ప్రభుత్వమని మాటల ప్రభుత్వం కాదని సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళు లాంటివి అని అన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తాడ్డే సన్యాసినాయుడు, మండల సీనియర్ నాయకులు కోట్ల మోతి నాయుడు, తాడ్డే చంద్రశేఖర్, సుబ్బరాజు మండల చీపురుపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షులు విజినిగిరి శ్రీనివాసరావు, మండల బిజెపి అధ్యక్షులు సరిదిరామనాయుడు రామ్మోహన్ నాయుడు, కే ధనంజయ, ముదునూరు కృష్ణమూర్తి, శివ డాక్టర్, భాస్కర్ రాజు, ముదునూరు వెంకటపతి రాజు ఎంపీడీవో భాస్కరరావు, తహసిల్దార్ అజు రఫీ జాన్, పి ఆర్ డి యు రమణమూర్తి ఎంఈఓ చంద్రశేఖర్ ఉపాధి హామీ ఎపిఓ ఇన్చార్జ్ నరేంద్ర కుమార్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గద్దర్ సభను జయప్రదం చేయండి

గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర-రాజాం: ప్రజా చైతన్యం కోసం తన జీవితాన్నే అంకితం ఇచ్చిన మహో న్నతుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ అని, బహుజన నేతలు జరజాన నీలయ్య, దేబారికి రామప్పుడు, బొత్స బుద్దుడు, పాటల తూట ఉదయ భాస్కర్ పిలుపునిచ్చారు. రాజాం అంబేద్కర్ జంక్షన్ లో ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం గద్దర్ సభకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుండి సభ జరుగుతుందని ముఖ్యఅతిథిగా వెన్నెల గద్దర్ హాజరవుతున్నారని ఈ సభకు మానవ హక్కుల నేతలు, పూలే అంబేద్కర్ వాదులు, ఉద్యమ నేతలు, అందరూ పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో, గునాపు తవిటియ్య, నక్క తవిటయ్య, వడ్డీ పాపారావు, రౌతు గణపతి రావు నాయుడు, శీర అనిల్ కుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, కుప్పిలి గణపతి పాల్గొన్నారు.

నెల్లిమర్ల జూట్ మిల్లును తక్షణమే తెరిపించాలి

విపక్షాల డిమాండ్

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్ మిల్లును తక్షణమే తెరిపించాలని విపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురు వారం ధర్నా చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ కి వినతిపత్రం అందించారు. సిపిఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు, సిపిఎం మండల నాయకుడు కిలంపిల్లి రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కనకల పద్మనాభం మాట్లాడుతూ ముడి సరకు కొరత నెపంతో కేవలం రెండు వారాలు పాటు మిల్లును మూసి వేస్తామని యాజమాన్యం నోటీసు ద్వారా తెలియజేసిందిని చెప్పారు. ఆరు నెలలు గడుస్తున్నా మిల్లును తెరవకపోవడంపై కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. సీజన్ లో మిల్లును నడిపించి అన్ సీజన్ లో మిల్లును మూసివేయడం కార్మికులు ఉపాధి లేక నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. జూట్ మిల్లులో సుమారు రెండు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని వెల్లడించారు. ఇందులో 1200 మంది రిటైర్డు కార్మికులకు 2016 నుంచి గ్రాట్యూటీ, పీఎఫ్ బకాయిలు యాజమాన్యం చెల్లించకపోవడంతో కార్మికులు అవస్థలు పడుతున్నారని తక్షణమే ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకుని మిల్లును తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో నామాల సూర్యనారాయణ, అప్పల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సరసమైన ధరలకు సరుకులు అందించాలి

ధరల స్థిరీకరణ సమావేశం లో జేసి సేతు మాధవన్

విశాలాంధ్ర-విజయనగరం: నిత్యావసర సరకులను సరసమైన ధరలకు అందించాలని జే సి సేతు మాధవన్ తెలిపారు. మార్కెట్ లో ధరలు పెరగకుండా టోకు వర్తకులు సహకరించాలని కోరారు. గురువారం జే.సి తన ఛాంబర్ లో ధరల స్థిరీకరణ పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టమాటో, ఉల్లి, బంగాళా దుంపలు స్థానికంగా ఉత్పత్తి లేనందున టోకు వర్తకుల పై ఆధార పడవలసి వస్తుందని వారు అధిక లాభాలకు విక్రయించ కుండా , వారికి కూడా నష్టం జరగకుండా సరసంగా ఉండే ధరలకు ప్రజలకు అమ్మేలా సహకరించాలని కోరారు. రైతు బజార్ లో బియ్యం, కందిపప్పులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమె విక్రయించాలని తెలిపారు. పామ్ ఆయిల్ కిలో 110 రూపాయలకు , సన్ ఫ్లవర్ ఆయిల్ కిలో 124 రూపాయలకు విక్రయించాలని తెలిపారు. ఈ మధ్య కాలం లో టమాట రాష్ట్రమంతటా అధిక ధరలకు సుమారు 100 రూపాయలకు విక్రయించినప్పటికీ విజయనగరం రైతు బజార్ లో 45 రూపాయలకే మంచి వెరైటీని అందించ గలిగామని, అందుకు సహకరించిన హెూల్ సేల్ వర్తకులను అభినందించారు. ఈ సహకారాన్ని ఇలాగె కొనసాగించాలని కోరారు. ఈ సమావేశం లో మార్కెటింగ్ ఎ.డి రవి కిరణ్, డి.ఎస్.ఓ మధుసూదన్ , ఉద్యాన, వ్యవసాయ శాఖల ఎ.డి లు శైలజ, అన్నపూర్ణ, రైతు బజార్ ఎస్టేట్ అధికారులు సతీష్ , ఉమా మహేశ్వర రావు , అప్పల నాయుడు , సూపరింటెండెంట్ రమణ మూర్తి , పలువురు టోకు వర్తకులు తదితరులు హాజరైనారు.

అదుపులోకి రాని డయేరియా

గుర్లలో ఒకరు, కోటగండ్రేడులో మరొకరు మృతి, 6కు చేరిన మృతులు సంఖ్య

విశాలాంధ్ర-గుర్ల: గుర్లలో డయేరియా విజృంభిస్తుంది. ఒక్కరోజే నలుగురు మృత్యువాత పడ్డారు. గురువారం బోడసింగి రాములమ్మ (65) డయేరియాతో మృత్యువాత పడ్డారు. నాలుగు రోజులు కిందట పడగ విప్పిన డయేరియా గురువారం అదుపులోకి రాకపోవడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గుర్ల జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నారు. కోటగండ్రెడ్డు గ్రామానికి చెందిన మరడాన అప్పలనరసయ్యమ్మ రెండు రోజుల క్రితం గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందింది మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించి ఆరోగ్యం విశ్వవించడంతో విశాఖపట్నం కేజీహెచ్ హాస్పిటల్ కు తరలించి వైద్యం పొందుతూ బుధవారం అర్ధరాత్రి సమయంలో మరడాన అప్పలనరసయ్యమ్మ(57) మృతిచెందింది.

13వ డివిజన్ లో వార్డు పర్యటన

నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ తిరుమలరావు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : వార్డు పర్యటనలో భాగంగా గురువారం విజయనగరం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు వివిధ విభాగాల అధికారులతో 13వ డివిజన్లో పర్యటించారు. అంజనేయస్వామి ఆలయం జంక్షన్ నుండి ప్రారంభమైన వార్డు పర్యటన వివిధ ప్రాంతాలలో సాగింది. అక్కడక్కడ సమస్యలను ప్రజలు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. కొన్నిచోట్ల కాలువలు సరిగా లేవని, పూడికలు పెరిగిపోయాయని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ సూచనలతో ప్రతి గురువారం వార్డు పర్యటనలు చేపడుతున్నా మన్నారు. ఇందులో భాగంగా ఈరోజు 13వ డివిజన్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. మీ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టి అవి పరిష్కారం అయ్యేవిధంగా చొరవ చూపుతామన్నారు. వార్డు పర్యటనలో రెండు అంగన్వాడి కేంద్రాలను కూడా పరిశీలించామన్నారు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్న పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం ప్రక్రియను పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి గ్రామ సభలు..

తహసిల్దార్ జె.రాములమ్మ

విశాలాంధ్ర-వేపాడ : మండలంలో ఇదివరకు రీ సర్వే ఆయన గ్రామాలలో నేటి నుండి అనగా శుక్రవారం నుండి గ్రామ సభలో నిర్వహించడం జరుగుతుందని మండల తహసీల్దారు జె.రాములమ్మ తెలిపారు.దీనికి సంబంధించి రెవెన్యూ గ్రామ సభలకు షెడ్యూల్ 18న జమ్మాదేవిపేట గ్రామంలో 19న నీలకంఠ రాజపురంలో 21న పెదగుడిపాలలో 22న బల్లంకి తుని కె.పి.రాజపురంలో 23న బల్లంకి గ్రామంలో 24న బాణాది గ్రామంలో 25నరాయుడుపేటలో 26న చామలాపల్లిలో 28న అరిగిపాలెంలో 29న ఓబులయ్యపాలెం (కాకులపాలెంలో)30న ముకుందపురం గ్రామాల్లో గ్రామ సభలో నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ మేరకు రీ-సర్వే అయిన భూములకు సంబంధించి సమస్యలు ఉన్నయెడల రైతులు గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవలసిందిగా తెలియజేశారు.ఈ గ్రామ సభలకు తహశీల్దార్ తో పాటు రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్, మండల సర్వేయర్ తో పాటు వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లు హాజరవుతారన్నారు.

41 మద్యం బాటిళ్లు సీజ్...

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణ పరిధిలోని జి అగ్రహారం కు చెందిన గేదెల హరిబాబు అనే వ్యక్తి నుండి చీపురుపల్లి ఎస్సై ఎల్ దామోదర్ రావు సిబ్బంది గురువారం నాడు 41 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎల్ దామోదర సమాచారం మేరకు అక్రమ మద్యం షాపులకు సంబంధించి తనిఖీలు నిర్వహిస్తుండగా 41 మద్యం బాటిల్ దొరికినట్లు ఎస్సై వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

విశాలాంధ్ర-విజయ నగరం ఫోర్ట్ : జిల్లా స్థాయి అండర్ 14 అండర్ 17 ఎంపికలు గురువారం బాక్సింగ్ ఎంపికలు రాజీవ్ మైదానంలో జరిగాయి. ఈఎంపికలకు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో80 మంది పురుషులు 20 మంది స్త్రీలు పాల్గొన్నారు. అండర్ 17 లో ఎనిమిది మంది స్త్రీలు, అండర్ 14 లో 11 మంది పురుషులు ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రీడా అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ మన్మధరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, అలాగే క్రమశిక్షణతో ఉంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వెళ్తారని అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా క్రీడల్లో రాణించాలని, క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమం కోచ్ ఈశ్వరరావు, సీతారాం పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ కృష్ణంరాజు, పి.డి. చిన్నారి, పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర విజయనగరం పోర్ట్ : హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ జాతీయ సబ్ జూనియర్ మరియు సీనియర్ ఛాంపియన్షిప్ పోటీలలో విజయనగరం క్రీడాకా రులు ప్రతిష్టాత్మక పతకాలు సాధించడం ఎంతో అభినందనీయం. స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అతిథి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. ఈ పోటీలలో ఎస్. పల్లవి (71 కేజీల విభాగం) సీనియర్ విభాగంలో రజత, ఇంటర్ స్టేట్ రజత పతకాలు, చ. శ్రీలక్ష్మి (81 కేజీల విభాగం) సీనియర్ రజత మరియు ఇంటర్ స్టేట్ స్వర్ణ పత కాలు, వై. చైతన్యకుమారి (87 కేజీల విభాగం) జూనియర్ స్వర్ణ పతకం, కె. దినేష్ (67 కేజీల విభాగం) యూత్ కాంస్య పతకం సాధించారు . పతక విజేతలు కోచ్ చల్లా రాముతో కలిసి ఎమ్మెల్యే అదితిని కలవగా వారిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా వారి ప్రతిభను ప్రశంసి స్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు ఆమె శుభా కాంక్షలు తెలియజేశారు .కోచ్ ను ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి శిక్షణా ప్రతిభకు శుభాకాంక్షలు తెలియ జేశారు.

వైసిపి నాయకులపై దాడి...!



విశాలాంధ్ర. రేగిడి/రాజాం: రాజాం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రేగిడి ఆమదాలవలస మండలం కోడిస గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ పి.ఎ.సి.ఎస్ అధ్యక్షులు నెల్లి పెంటమ నాయుడు పై కొందరు టీడీపీ అనుచరులు అమానుష దాడికి పాల్పడినట్టు వైసీపీ వర్గాలు తెలిపాయి. రాజకీయంగా వైసీపీ నాయకత్వాన్ని ఎదుర్కోలేక, అధికారంలో ఉన్నామన్న భావనతో టీడీపీ నాయకులు రోజురోజుకూ దాడులకు దిగుతున్నారని వారు ఆరోపించారు. తాజాగా విజయనగరం జిల్లా, రేగిడి మండలం, కోడిశ వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ నెల్లి పెంటన్నాయుడు తలపై కర్రలు, రాళ్లతో టీడీపికి చెందిన కొందరు దాడి చేసి గాయపరిచారు. పెంటన్నాయుడు ప్రస్తుతం క్షతగాత్రులు రాజాం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుడు ఆరోగ్యంపై ఆరా తీసిన నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ తలే రాజేష్ రాజకీయ దాడులను ఖండించారు. దాడికి పాల్పడిన వ్యక్తులకు శిక్ష పడాలని అన్నారు. పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాల్ నాయుడు, యాలాల వెంకటేష్, టంకాల అచ్చెంనాయుడు వావిలపల్లి జగన్మోహన్, కరణం శ్రీనివాసరావు, డాక్టర్ నరేంద్ర వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎంపీపీ దొగ్గ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని కృష్ణరాయుడుపేట పంచాయతీ పరిధిలో అంక జోష్యలపాలెం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిసి రోడ్ల నిర్మాణానికి గురువారం మండల పరిషత్ అధ్యక్షులు దొగ్గ సత్యవంతుడు చేతుల మీదుగా భూమి పూజ చేశారు. అలాగే గ్రామ సభల్లో తీర్మానాలు చేసిన పనులు మేరకు అన్ని పనులు చేసే విధంగా గ్రామ సర్పంచ్ కృషి చేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెల్లుబోని ముసలి నాయుడు మండల జేసీసీ ఎస్ కమిటీ చైర్మన్ భోజంకి శ్రీను గ్రామ ప్రజలు పెద్దలు పాల్గొన్నారు.

ఎస్.కోట పట్టణంలో తాండవిస్తోన్న అపారిశుధ్యం

కాలువల్లో పేరుకుపోతోన్న మురుగునీరు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగవరపుకోట పట్టణ కేంద్రంలో ముస్లిం వీధిలో చెత్తాచెదారం పేరుకు పోయింది. ఈ విషయానికై ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసిన పట్టించు కోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరు గమనించదగ్గ విషయం ఈ విధంగా వీధులు పరిశుభ్రంగా లేకపోవడంతో పంచాయతీ అధికారులు చెత్తసేకరించే వాహనాలు అందుబాటులో ఉండకపోవడంతో అధికంగా చెత్త చెదారం పేరుకుపోయి విష జ్వరాలకు, అతిసార వ్యాధులకు త్రోవ ఇచ్చిన వాళ్ళు అవుతున్నారు ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి చెత్త చెదారం తొలగించి కాలువలను పరిశుభ్రంగా ఉంచే ప్రయత్నం చేయవలసిందిగా ఆ ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.

గుణుపూరు గ్రామాల్లో పల్లె పండుగ

విశాలాంధ్ర-డెంకాడ: పల్లె పండుగ లో భాగంగా డెంకాడ గుణుపూర్ గ్రామంలో గురువార ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు చేతుల మీదుగా సి.సీ రోడ్ నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లిమర్ల నియోజకవర్గం తెదేపా సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు డెంకాడ మండలం ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు ఎమ్మార్వో ఎమ్మార్వో పద్మావతి ఎంపీడీవో భవాని పంచాయితీ కార్యదర్శి విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణీరాజు డెంకాడ మాజీ సిహెచ్ సి ఛైర్మన్ దంతులూరి ప్రదీప్ రాజు మహంతి రమణ సర్పంచ్ మండల సత్యం మహంతి శ్రీను తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోచర్లలో గ్రామ సందర్శన కార్యక్రమం

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో ప్రతివారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పెట్టిన గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం లోచర్లలో జరిగింది. అయితే గ్రామ సందర్శన ప్రతివారం జరిగినట్లే జరిగింది. ఇలా జరగడంతో యధా రాజా తదా ప్రజ అన్నట్టుంది. మండల ప్రత్యేక అధికారి జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వి. టీ. రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా సచివాలయ సిబ్బంది పరిచయ వేదిక, తర్వాత గ్రామ సచివాలయం, రైతు భరోసా, వెల్నెస్ కేంద్రాలను అలాగే జిల్లా పరిషత్ హై స్కూల్ ఎంపీపీ స్కూల్, అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. ఈయనతో ఎంపీడీవో రేగు రాంబాబు స్థానిక సర్పంచ్ గర్భపు దాలమ్మ మండల శాఖ అధికారులు ఎంఈఓ జే. త్రినాధ రావు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు..

సమస్యలను పరిష్కరించుకునేందుకే గ్రామ సందర్శన

చింతాడ గ్రామసభలో తహశీల్దార్ కృష్ణలత

విశాలాంధ్ర-జామి: గ్రామాలలో సమస్యలనేట నేరుగా అధికారులే తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తహశీల్దార్ ఐ.కృష్ణలత అన్నారు. గురువారం మండలంలోని చింతాడ గ్రామంలో నిర్వహించిన గ్రామ సందర్శనకు అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ముందుగా సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈసభలో శాఖలవారీగా అధికారులు గ్రామంలోని సమస్యలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ సంభందిత సమస్యలపై ప్రజలకు తహశీల్దార్ అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈసమావేశం అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను, పాఠశాలను, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో కార్యాలయ ఎవో నరసింహంతోపాటు అధికారులు పాల్గొన్నారు.

శ్రీ వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖా గ్రంధాలయంలో గురువారం శ్రీ వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా శ్రీవాల్మీకి చిత్రపటానికి రిటైర్డ్ ఎం.ఈ.ఓ ఎం.సత్యన్నారాయణ, స్థానిక శాఖా గ్రంధాలయం అధికారి సి. హెచ్.కృష్ణ మూర్తి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ వాల్మీకి ఆదికవి ఈయన రామాయణము ను సంస్కృతి కార్యక్రమము ను రచించారు.వాల్మీకి శ్రీరామ పట్టాభిషకం అనంతరం రామాయణము రచన చేసారు.ఈయన ధర్మ సూత్రాలు రచనలు చేసారు ఈయన సూత్రం లో వినాశకాలం వచ్చినవారు వివేకమును కోల్పోయి ధర్మ విరుద్ధమైన పనులు చేసి నశిస్తారు.రావణుడు ఆంజనేయుడు నవ వ్యాకరణాల చదివిన సర్వ శాస్త్ర వేత్తలు.పరమార్థం తెలియని జీవితానికి ప్రయోజనం లేదు.వాల్మీకి 23 వేల శ్లోకాలు, 7కాండాలు (ఉత్తరకాండ సంగం) విభజించబడి ఉన్నాయి.రామాయణంలో 4 లక్షల ఎనభై వేల పదాలు ఉన్నాయి. శ్రీలంక లో రామాయణాయిద్ధ కాండ ముగించారు అని విశ్లేషకులు గుర్తుచేశారు.ఈ కార్యక్రమానికి పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోదవలస గ్రామంలో గ్రామ సందర్శన

విశాలాంధ్ర-డెంకాడ: మండలం లోని మోదవలస గ్రామపంచాయతీలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి జమదగ్ని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలు పంచాయతీ కార్యాలయం సిసి రోడ్లు కాలువలు పరిశీలించి గ్రామ సమస్యలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో పద్మావతి, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు ఎంపీడీవో భవాని గ్రామ సర్పంచ్ వివిధ శాఖల అధికారులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కి రన్నింగ్ రేస్ లో ప్రధమ స్థానం



విశాలాంధ్ర-డెంకాడ: ఇటీవల విజయనగరంలో ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఆవాల యశోద 400 మీటర్ రన్నింగ్ రేసులో ప్రధమ స్థానంలో కైవసం చేసుకున్నారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సిద్ధం

విశాలాంధ్ర-జామి: చాలాకాలంగా రైతులు ఎదురు చూస్తున్న సాగునీటి సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. ఎన్నికలకు సంభందించిన నోటిఫికేషన్‌ను ఈనెల 16న విడుదల చేయడం జరిగింది. అందులో భాగంగా ఇరిగేషన్ అధికారులు ఎన్నికలకు అవిసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలకు గాను మండలంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ముందుగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండలంలో 14 మైనర్ ప్రాజెక్టులు, 5 మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటికి సంభందించిన ఎన్నికలకుగాను గతంలో ఉన్న ఓటర్ల జాబితాను బైటకు తీస్తున్నారు. కొత్తగా ఓటర్లు చేరాలన్నా, తొలగింపులు చేయాలన్నా సంభందిత రెవెన్యూ అధికారిని సంప్రదించాల్సి ఉంటుందని ఇరిగేషన్ ఎఇ సంతోష్ తెలిపారు. ఈనెల 16నుంచి వచ్చే నెల 22 వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

సాగునీటి సంఘాలలో తేలనున్న బలాబలాలు.

మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తే తమ సత్తా నిరూపించుకునేందుకు అటు అధికార టీడీపీతోపాటు, ఇటు వైసీపీ నేతలు సిద్ధంగా ఉన్నారు. ఈఎన్నికలను ఇరుపార్టీల నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. గతంలో నేడు వైసీపీలో ఉన్న నేతలే సంఘాల ఎన్నికలలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేవారు. ఈసారి వారి దూకుడుకు టీడీపీ నేతలు కళ్ళెం వేస్తారో లేదో చూడాలి..

గుర్లలో పర్యటించిన రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ పద్మావతి

విశాలాంధ్ర-గుర్ల: రాష్ట్ర ప్రజా ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి గుర్ల గ్రామంలో ఆమె పర్యటించారు పలు వీధుల్లో ఆమె పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచినీరు అందించే విధానం తోపాటు వాటర్ పైపులు లీకేజీలు చెత్తాచెదారం ఉండే చోట పైపులైను ఉండడం వాటిని కూడా పరిశీలించారు. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచన మేరకు ఆమెఇక్కడికి వచ్చి పరిశీలిస్తున్నట్లు అని తెలిపారు ప్రజలకు ఎటువంటి సమాచారం తెలిపిన తమ దృష్టి కి తీసుకురావాలన్నారు రెండు రోజులు పాటు గ్రామాల నుండి పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చే వరకు అన్ని విధాలుగా సహాయ సహకార అందిస్తామని తెలిపారు. వాంతులు విరోచనాలు కావడానికి సరైన సమాచారం తెలుసుకోవడం వాటిని అదుపు చేయడం జరుగుతుందన్నారు చెడు పదార్థాలు మాంసం కృతులు. నిల్వ ఉండే సరుకులు తింటే ఇలాంటి పరిస్థితులు కూడా రావచ్చని ఆమె అన్నారు అన్ని పరిస్థితులపై అవగాహన కల్పించుకుని యుద్ధ ప్రాతిపదికిన పనులు చేస్తామన్నారు. గత రెండు రోజుల నుంచి గ్రామంలో పూర్తిగా చెత్తాచెదారం తొలగించే కార్యక్రమం గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు ప్రతి చోట చెత్త లేకుండా చూస్తున్నారు. మురికి నీరు ఉన్న ప్రాంతంలో వాటిని కూడా తొలగించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అని తెలిపారు. రాష్ట్ర స్థాయి జిల్లాస్థాయి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గ్రామంలో ఉండి పరిస్థితిని అదుపు చేస్తున్నారు.

సుశీలమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుల ఔదార్యం

నాలుగు చక్రాల బ్యాటరీ సైకిల్ వితరణ

విశాలాంధ్ర-రాజాం : తన తల్లిపేరిట స్థాపించిన ఫౌండేషన్ ద్వారా విద్యారంగంలో సేవలు మరింత విస్తృతం చేయడమే కాకుండా చదువుకునే విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా మరో అడుగు ముందుకేసి తన సేవలను విస్తరించారు. మంచి ఆశయంతో చదువుకోవాలనే కోరిక ఉన్నవారితోపాటు చదువుకోవాలనే ఆశ ఉన్నవారికి నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ పలువురి మన్ననలు పొందుతున్న వ్యక్తి. మనం చేసే సాయం చేయాల్సిన సాయం అర్హులైన వారికి అందితే అదే సంతృప్తిగా భావించే ఉదారస్వభావి, ఆయనే లోలుగు మధన్. రెండేళ్ల క్రితం తన తల్లి లోలుగు సుశీలమ్మ పేరిట లోలుగు సుశీలమ్మ ఫౌండేషన్ స్థాపించి వెనుకబడి ఉన్నత విద్యను అందుకోలేని ఎంతో మంది విద్యార్థులను ఢిల్లీలో సివిల్ సర్వీస్ లలో తన సొంతఖర్చులతో ఉచిత శిక్షణ అందించిన గొప్ప దార్శనికుడు ఆయన. అదే స్ఫూర్తితో రాజాం మున్సిపాల్టీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన పుట్టా జగదీష్ డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. స్వతహాగా దివ్యాంగుడు కావడంతో పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని తన తండ్రి సూర్యనారాయణ గ్రామస్థుల సహకారంలో సుశీలమ్మ ఫౌండేషన్ అధినేత లోలుగు మధన్ కు ఆశ్రయించగా పరిశీలించిన ఆయన, విద్యార్థి చదువుకునేందుకు తనవంతు సహాయంగా రూ. 40వేలతో నాలుగు చక్రాల బ్యాటరీ సైకిల్ కొనుగోలు చేశారు. ఈ మేరకు గురువారం పొనుగుటివలస గ్రామంలో విద్యార్థి పుట్టా జగదీష్ కు గ్రామ పెద్దల సమక్షంలో ప్రముఖ వైద్యులు సామంతుల కిరణ్ చేతులు మీదుగా సైకిల్ అందించి పెద్ద మనసు చాటుకున్నారు. ఎంతో ఉన్నత ఆశయంతో స్థాపించిన ఫౌండేషన్ ద్వారా సేవలు అందించడం గొప్పవిషయమని, ఎంతో మంచి మనసు ఉండేగాని ఇటువంటి సేవాభావం అలవడదని ఈ సందర్భంగా మధన్ సేవలను పలువురు కొనియాడారు. ఆయన స్ఫూర్తితో మరింత మంది ముందుకు రావాలని ఆకాంక్షించారు. అనంతరం మధన్ మాట్లాడుతూ సేవ చేయడం గొప్పకాదని, దానిని సద్వినియోగం చేసుకున్నప్పుడే దానికి ఒక సార్థకత చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు గార గున్నంనాయుడు, శాసపు రమేష్ కుమార్, రెడ్డి మహేష్, జల్ల లక్షున్నాయుడు, కెంబూరు సతీష్, పీఎంసీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, శాసపు శ్రీనివాసరావు, శాసపు రాజేష్, గార సత్యనారాయణ, శాసపు మోహన్ నాయుడు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సందర్శన

విశాలాంధ్ర-నెల్లిమర్ల: పరిష్కారానికే గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి పి కూర్మినా యుడు అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో ఎంపీడీఓ కె రామకృష్ణ రాజు, తహశీల్దార్ సుదర్శన్ తో కలిసి గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పనులు నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని చెప్పారు. అనంతపురం పల్లె పండగలో భాగంగా ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మాణం చేపట్టనున్న సీసీ రహదారికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచి అట్టాడ శ్రీను, నాయకులు గురాన చక్రీధర్ పాల్గొన్నారు.

చీపురుపల్లిలో గ్రామ సందర్శన

విశాలాంధ్ర-చీపురుపల్లి: గ్రామంలో సుదీర్ఘ కాలంగా నెలకొని ఉన్న అపరిష్కృత సమస్యలను గుర్తించి సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించేందుకే గ్రామ సందర్శన కార్యక్రమం చేపట్టినట్లు మండల స్థాయి అధికారులు వెల్లడించారు. గురువారం మండలంలోని దేవరపూడల గ్రామంలో ప్రభుత్వ ఆదేశానుసారము ప్రతి వారము నిర్వహించనున్న గ్రామ సందర్శన కార్యక్రమాన్ని మండల అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలను అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పథకము నిర్వహణ అమలు తీరు భోజన నాణ్యత నేను తదితర అంశాల పట్ల విద్యార్థులతో చర్చించి పరిశీలించారు... అలాగే గ్రామంలో పారిశుధ్య నిర్వహణ త్రాగునీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు... పలుచోట్ల డయేరియా ప్రబలడంతో మంచినీటి కుళాయిలు బోరు బావుల వద్ద పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సంబంధిత శాఖ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు గ్రామస్థాయి నాయకులు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామునిపేటలో నేడు పల్లె పండగ

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల మండలం సీతారామునిపేటలో నేడు నిర్వహించనున్న పల్లె పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం రామతీర్థంలో గిరిప్రదర్శన రహదారికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు. రూ.2 కోట్లు ఉపాధిహామీ నిధులతో బోడి కొండ చుట్టూ సుమారు రెండు కిలో మీటర్ల మేర బీ టీ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. బీటీ రహదారి నిర్మాణం పూర్తయితే పర్యాటకంగా రామతీర్థం మరింత అభివృద్ధి చెందుతుందని భక్తులు అంటున్నారు.

అంకజోస్యులపాలేంలో పల్లె పండుగ వారోత్సవం

శంకుస్థాపనలో టీడీపీ అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని కృష్ణా రాయుడుపేట పంచాయతీ శివారు అంకాజోష్యుల పాలేం గ్రామంలో గురువారం టీడీపీ అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ పల్లె పండుగ వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశానుసారం గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని ఇప్పుడు తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు.పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించడం జరిగిందని. రాష్ట్ర వ్యాప్తంగా 13,324 గ్రామాల్లో ఒకేసారి పల్లె పండుగ వారోత్సవాలు జరిగాయన్నారు . పల్లె పండుగలో భాగంగా దాదాపు రూ.4వేల500 కోట్ల వ్యయంతో 30 వేల పనులను చేపట్టింది ప్రభుత్వం 3వేల కిలో మీటర్ల మేర సీసీ రోడ్లు,500 కిలో మీటర్ల తారు రోడ్లు,వ్యవసాయ కుంటలు,పశువుల శాలలు,ఇంకుడు గుంతల నిర్మాణాల వంటి పనులు చేపట్టబోతోంది ఈ ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి,బానాది ఎంపీటీసీ గొంప తులసి,గ్రామ సర్పంచ్ చెలుబోని ముసలి నాయుడు (బాలబాబు),కొటాన అర్జునరావు, ఇనరపు రమణ వంటాకు సముద్రం అంకజోస్యులపాలేం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



విశాలాంధ్ర-రాజాం : ఈ రోజు రాజాం మండల పరిధిలోని గడిమూడిదాం, కంచరాం, రాజయ్యపేట గ్రామంలలో పల్లె పండుగ కార్యక్రమం లో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నుండి మంజూరు కాబడిన సిసి రోడ్, కాలువలు పనులకు భూమి పూజ చేయడమయినది. గురవనా నారాయణరావు,ఎంపిడివో వావిలపల్లి శ్రీనివాసరావు, టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదు గ్రామాలలో పల్లెపండుగ శంఖుస్థాపనలు

విశాలాంధ్ర-జామి: మండలంలోని పల్లె పండగ శంఖుస్థాపనలు గురువారం 5గ్రామాలలో జరిగింది. ఎంపిడివో నీలం అప్పలనాయుడు ఆద్వర్యంలో జరిగిన ఈకార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు, ప్రధాన కార్యదర్శి వర్రిరమణ, దనియాల పైడిరాజు, మాజీ జెడ్పిటిసి బండారు పెద బాబు, టీడీపీ నేతలు కొత్తలి సూర్యారావు, రాయవరపు శ్రీను, ఎన్నింటి అప్పలరాజు, ముకుంద శ్రీను, వేమలి అప్పలనాయుడు పాల్గొనిపనులకు శంఖుస్థాపనలు చేసారు. మొకాసా కొత్తవలస, అన్నంరాజుపేట, శాసనాపల్లి, వెంకటరాజుపాలెం, జన్నివలస గ్రామాలలో పల్లె పండగ నిర్వహించారు. ఈకార్యక్రమాలలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.

పలు గ్రామపంచాయతీలలో పల్లె పండుగ

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని మోపాడ బంగారుపేట ఢీకొల్లం గుడు పూరు డెంకాడ గ్రామం పంచాయ తీలలో పల్లె పండుగ కార్యక్రమాన్ని గురువారం ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామం లోని సిమెంట్ రోడ్డు బీటీ రోడ్లు గోకులాలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భవాని ఈ ఓ పి ఆర్ డి.శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు పలు గ్రామ పంచాయతీలో సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పంచాయతీ కార్యదర్శులు గ్రామ పెద్దలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

18 నుంచి రీసర్వే గ్రామాల్లో గ్రామ సభలు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో భూ సర్వే గ్రామాలలో జిల్లా కలెక్టర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు ఈనెల 18వ తేదీ నుంచి వచ్చే నెల 12 వరకు రీ సర్వే గ్రామాలలో గ్రామసభలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవిన్యూ గ్రామ సభలో నిర్వహిస్తామని అన్నారు. ఈనెల 18వ తేదీన దశవంతపురం, 19 పూతికవలస,21శ్యాంవలస,22 పొట్టేడవలస,23 కొత్త కర్ర,24 సిరిదేవి పురం,25 చల్లాపురం,26 కుంచ గుమడం,28 గాతాడ,29 బాడాం,30 విశ్వనాథపురం,2 వాసుదేవపురం,4 కొర్లాం,6 గొట్టిపల్లి,7 బిళ్ళలవలస,8 సోమలింగాపురం, 11 రామయ్య వలస,12 మర్రి వలస గ్రామాల్లో రెవిన్యూ గ్రామసభలో నిర్వహిస్తున్నట్లు మెరక ముడిదాం తహసిల్దార్ అజు రఫీ జాన్ తెలిపారు.

చినగుడిపాల ఎంపీపీ పాఠశాల సందర్శన

ఎంపీడీఓ..సూర్యనారాయణ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని చినగుడిపాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ సూర్యనారాయణ గురువారం సందర్శించి పాఠశాల నిర్వహణను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం,పాఠశాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వాహన, పాఠశాల ఆవరణలో కూరగాయలు పెంపకం,పరిశీలన అనంతరం విధ్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోజంకి రామునాయుడు, టిడిపి నాయకులు, వేచలపు రామక్రిష్ణ, ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శి, కన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చీపురుపల్లి ప్రయాణికులకు తీరనున్న కష్టాలు...

శరవేగంగా రైల్వే బ్రిడ్జి నిర్మాణపు పనులు.....

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి ప్రధాన కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణపు పనులు వేగవంతం కావడంతో గత ఐదేళ్లుగా ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించనున్నది. ఈ ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు మొదలుపెట్టిన నాటి నుండి చీపురుపల్లి తో పాటు రాజాం పాలకొండ విజయనగరం విశాఖపట్నం రాకపోకలు సాగించే ప్రయాణికులు నేటి వరకు నిత్యం నరకాన్ని చవి చూస్తున్నారు. రైల్వే బ్రిడ్జి పనులు ఇప్పటివరకు నత్త నడకగా కొనసాగడంతో ప్రజలు పలు ప్రాంతాలకు ప్రయాణాలు చేయడానికి నరకయాతన అనుభవించారు. చీపురుపల్లి నుండి రాజాం పాలకొండ వెళ్లవలసిన ప్రయాణికులు విజయనగరం నుండి పాలకొండ వెళ్లవలసిన ప్రయాణికులు, పాలకొండ రాజాం ప్రాంతాల నుండి చీపురుపల్లి విజయనగరం విశాఖపట్నం వెళ్లవలసిన ప్రయాణికులు కూడా బ్రిడ్జి నిర్మాణపు పనుల అంతరాయం కారణంగా అనేక అవస్థలు పడుతున్నారు. చీపురుపల్లి కాంప్లెక్స్ వరకు విశాఖపట్నం విజయనగరం నుండి వచ్చే ప్రయాణికులు చేరుకొని అక్కడ నుంచి ప్రత్యేక ఆటో ద్వారా చీపురుపల్లి రైల్వే స్టేషన్ శివారులకు అదనంగా డబ్బులు చెల్లించి ప్రయాణించేవారు. అక్కడనుండి రాజాం పాలకొండ వెళ్లవలసిన ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల ద్వారా ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణాలు కొనసాగించేవారు. అదేవిధంగా పాలకొండ రాజాం నుండి వచ్చిన ప్రయాణికులు చీపురుపల్లి రైల్వే స్టేషన్ కు చేరుకుని ప్రైవేటు ఆటోల ద్వారా చీపురుపల్లి బస్ కాంప్లెక్స్ చేరుకుని అక్కడి నుండి విజయనగరం విశాఖపట్నం వెళ్లవలసి వస్తుండేది. ఇదిలా ఉండగా పాలకొండ నుంచి నేరుగా విశాఖపట్నం వెళ్లవలసిన ఎక్స్ప్రెస్ బస్సులు కూడా రాజాం మీదుగా ఉత్తరవల్లి మీదుగా గర్భాం జంక్షన్ నుండి గరివిడి రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకొని అక్కడ నుండి విశాఖపట్నం విజయనగరం బయలుదేరుతూ ప్రయాణికులకు అందుబాటులో ఉండేవి. ఒక్క చీపురుపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కారణంగానే ఇంతటి వ్యయ ప్రయాసలు పడిన ప్రయాణికులకు ఏట్టకేలకు ఊరట లభించనున్నది. విజయనగరం ఎత్తు బ్రిడ్జి వద్ద గతంలో నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి మాదిరిగానే చీపురుపల్లి వద్ద నిర్మాణం జరుగుతున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణం సంబంధించి బ్రిడ్జి నమూనాను పూర్తిస్థాయిలో తయారుచేసి బ్రిడ్జిపై అమర్చడానికి సిద్ధంగా ఉంచడంతో పలు ప్రాంతాల ప్రయాణికులు ఊపిరి పీల్చుకుంటున్నారు. రానున్నది పండగ రోజులు కావడంతో విశాఖపట్నం నుండి విజయనగరం చీపురుపల్లి రాజాం పాలకొండ వరకు వేలాది మంది భక్తులు ప్రయాణించే అవకాశం ఉన్నది. పండగ నాటికి పూర్తిస్థాయిలో బ్రిడ్జి రాకపోకలకు అందుబాటులో తీసుకు రాగలరని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఈ బ్రిడ్జి నిర్మాణం పనుల కారణంగా పట్టణంలోని రిక్షా కాలనీ, కొత్తగ్రహారం, కొండ లక్ష్మీపురం, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించవలసిన రహదారి పూర్తిస్థాయిలో రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల కొరకు అడ్డుకట్ట వేయడంతో ఆ ప్రాంతాలకు ప్రజలు కూడా ఆందోళనకు సిద్ధమవుతున్నారు. బ్రిడ్జి నిర్మాణపు పనులు త్వరిత గతిన పూర్తి చేయడంతో పాటు, రహదారి సౌకర్యం కోసం ఆందోళన చేస్తున్న రిక్షా కాలనీ కొత్తగ్రహారం, కొండ లక్ష్మీ పురం ప్రాంతాల వాసులకు గతంలో అధికారులు ఇచ్చిన హామీ మేరకు రహదారి సౌకర్యాన్ని కల్పించాలని పలువురు కోరుతున్నారు.